సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా..

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

లక్ష్మీదేవిపల్లి, మార్చి 1 : ఐదేళ్ల పదవీ కాలంలో సమస్యలు లేని నియోజకవర్గంగా కొత్తగూడెంను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతానని, ప్రతి సమస్యకు పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకుంటానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కారుకొండ రామవరం నుంచి మదార్‌తండా వరకు రూ.79 లక్షల గిరిజనా భివృద్ధి శాఖ ఎస్టీఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచిన మూడు నెలల్లోనే అంతర్గత రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలపై దృష్టి సారించామన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. రూ.2.55 కోట్ల ఈజీఎస్, గిరిజనాభివృద్ధి శాఖల నిధులతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు పూర్తవుతున్నాయన్నారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే అనుమతి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, తహసీల్దార్ రామకృష్ణ ప్రసాద్, సీడీపీవో కనకదుర్గ, ఆర్‌అండ్‌బీ ఈఈ నాగేశ్వరరావు, పీఆర్ డీఈ రామకృష్ణ, ఏఈలు శివలాల్, శ్రీకాంత్, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ రాధిక, ఎంపీటీసీ స్వాతి, మాజీ సర్పంచ్ శారద పాల్గొన్నారు.

'వీరయోధుల'కు నాలుగు కొలువులు

ఇల్లెందు రూరల్, మార్చి 1: ఇల్లెందు పట్టణానికి చెందిన వీరయోధుల భవాని గురువారం విడుదలైన ఫలితాల్లో పీజీటీ, టీజీటీ బయో సైన్స్, టీజీటీ సైన్స్, గురుకుల జూనియర్ లెక్చరర్ పోస్టులను సాధించింది. ఈ కొలువుల్లో తాను గురుకుల జూనియర్ లెక్చరర్ ఉద్యోగాన్ని ఎంపిక చేసుకుంటానని భవాని తెలిపింది. నాలుగు కొలువులు సాధించిన ఈమెను పట్టణవాసులు అభినందించారు.

రమాదేవికీ నాలుగు ఉద్యోగాలు..

కరకగూడెం, మార్చి 1: కరకగూడెం మండలం సమత్‌మోతే పంచాయతీ పరిధిలోని గొల్లగూడేనికి చెందిన మలకం రమాదేవి జూనియర్ లెక్చరర్, టీజీటీ ఇంగ్లిష్, టీజీటీ గణితం, పీజీటీ ఇంగ్లిష్ ఫలితాల్లో సత్తా చాటి నాలుగు కొలువులూ సాధించింది. సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన రమాదేవి విద్యాభ్యాసమంతా ప్రభుత్వ విద్యాలయాలు, కళాశాలల్లోనే సాగింది. ఒకవైపు పోటీ పరీక్షలకు సిద్ధమవుతూనే ఆమె ఫైఖర్చుల కోసం విద్యార్థులకు ట్యూషన్ చెప్పుండేది. ఆమె కృషి అక్షరాల ఫలించి ప్రభుత్వ కొలువులు సాధించేందుకు దోహదం చేసింది. ఆమెను గ్రామస్తులు, పలువురు నాయకులు అభినందించారు. వచ్చిన కొలువుల్లో జూనియర్ లెక్చరర్ పోస్టును ఎంచుకుంటానని ఆమె తెలిపింది.

పారిశుధ్య పనుల్లో అలసత్వం వద్దు

సిబ్బందితో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి

కొత్తగూడెం అర్బన్, మార్చి 1: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి హెచ్చరించారు. మున్సిపల్ స్వచ్ఛ ఆటోడ్రైవర్లతో పట్టణంలోని ప్రగతిమైదాన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇకపై పనులు విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి వీధినీ శుభ్రంగా ఉంచాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను, జవాన్లను ఆదేశించారు. పట్టణంలోని 36 వార్డులకు 42 స్వచ్ఛ ఆటోలను కేటాయించినప్పటికీ ఎక్కడ పడితే అక్కడ పారిశుధ్య పనుల్లో లోపం కనిపించడానికి కారణాలు ఏంటని ప్రశ్నించారు. అనంతరం ప్రగతిమైదానంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. కౌన్సిలర్లు వేముల ప్రసాద్‌బాబు, తలుగు అనిల్, మున్సిపల్ అధికారులు రవి కుమార్, రాము, అశోక్ చౌహాన్, వీరభద్రచారి తదితరులు పాల్గొన్నారు.

'వన విహార్'లో అగ్నిప్రమాదం

లక్ష్మీదేవిపల్లి, మార్చి 1: జిల్లా ఫారెస్టు కార్యాలయమైన వన విహార్‌లో గురువారం భారీ అగ్నిప్రమాదం జరుగగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. అయితే సిబ్బంది అప్రమత్తమై అక్కడ ఎటువంటి నష్టమూ వాటిల్లకుండా చర్యలు చేపట్టారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఎండిన చెత్తకు నిప్పు అంటించే క్రమంలో చుట్టుపక్కల ఉన్న మొక్కల ట్రైల్స్ అంటుకోవడంతో మంటలు ఎగిసిపడ్డాయి. అయితే ఈ ఘటనపై వివరణ కోరిన మీడియా ప్రతినిధులపై అటవీ అధికారులు దురుసుగా ప్రవర్తించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సారపాక, మార్చి 1: భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సా రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం భవన నిర్మాణ కార్మిక సంఘం పెయింటింగ్ యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని, వారికి భవిష్యత్ లేకుండా చేస్తుందన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

INDUSIND BANK LTD.
COMMERCIAL VEHICLE FOR SALE
1). TS28TA 1445 ASHOK LEYLAND ECOMET - 2019 MODEL. 2). TS28TA 9095 ASHOK LEYLAND - DOST 2022 MODEL
Cell:7338930766
H.No. 6-8-100, 2nd Floor, KNR Mansion, Ganesh Basthi, Kothagudem, Bhadradri Kothagudem Dist.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

కేసుల విచారణలో జాప్యం వద్దు

- ఇకపై గంజాయి వినియోగదారులపైనా కేసులు
- అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకుంటాం
- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజు

సమావేశంలో పోలీస్ అధికారులు

కొత్తగూడెం క్రైం, మార్చి 1: కేసుల విచారణలో జాప్యం జరిగితే సహించేది లేదని ఎస్పీ రోహిత్‌రాజు స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని తేల్చిచెప్పారు. జిల్లాలోని పోలీస్ అధికారులతో పట్టణంలోని ఐఎంఏ హాల్లో శుక్రవారం నిర్వహించిన నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. కేసుల విచారణలో జాప్యం చేయకూడదని, ప్రతి కేసులోనూ 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ఉండాలని, తద్వారా నేరస్తులకు శిక్ష పడేలా చేయాలని, బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. నిషేధిత గంజాయి, పీడీఎస్ రైస్ అక్రమ రవాణా, మట్కా, పేకాట వంటి జూదాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొందరు యువకులు ప్రభుత్వ నిషేధిత గంజాయితోపాటు ఇతర మత్తు పదార్థాలకు బానిసలై తమ నిండు జీవితాన్ని ఛిద్రం చేసుకుంటున్నారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా హాట్‌స్పాట్లను గుర్తించి గంజాయి రవాణా చేసే వ్యక్తులతోపాటు వాటిని వినియోగించే వ్యక్తులపై కూడా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలను పాటించకుండా మద్యం తాగి వాహనాలను నడుపుతూ, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యేవారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం గత నెలలో వర్టికల్స్ వారీగా విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఏఆర్ అదనపు ఎస్పీ విజయ్‌బాబు, భద్రాచలం ఏఎస్పీ పరితోశ్ పంకజ్, ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్ సింగ్, డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, ఎన్.వెంకటేశ్, చంద్రభాను, రవీందర్‌రెడ్డి, డీఎస్పీ మల్లయ్యస్వామి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

రోజుకు 2.35 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలి

ఏరియాల జీఎంల సమీక్షలో సింగరేణి సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, మార్చి 1: ఈ ఆర్థిక సంవత్సరంలో చివరి నెల అయిన మార్చిలో రోజుకు కనీసం 2.35 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలని, అదే పరిమాణంలో రవాణా ప్రక్రియను కూడా పూర్తి చేయాలని సింగరేని సీఎండీ బలరాంనాయక్ సూచించారు. తద్వారా ఈ నెలాఖరు నాటికి 700 లక్షల టన్నుల వార్షిక లక్ష్యాన్ని అధిగమించాలని ఆదేశించారు. సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల జీఎంల హైదరాబాద్ సింగరేణి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. అనంతరం, ఆయా ఏరియాల్లో లక్ష్యాల సాధనకు ఉన్న ఇబ్బందులను డైరెక్టర్ల సమక్షంలో చర్చించి తక్షణ పరిష్కార మార్గాలు సూచించారు. ఈ ఏడాది నిర్దేశించుకున్న 700 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని, రవాణాను సాధించడానికి ప్రతి ఏరియా జనరల్ మేనేజర్ తన కింది అధికారులతోనూ, ఓవర్ బర్డెన్ యాజమాన్యంతోనూ సమీక్షిస్తూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎన్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎంలు ఎం.సురేశ్, జే.సురేశ్, జేవీఎల్ గణపతి, జీఎం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి ఒక్క అడుగు దూరంలో 'సింగరేణి'

ఫిబ్రవరిలో వందశాతం బొగ్గు ఉత్పత్తి

కొత్తగూడెం సింగరేణి, మార్చి 1: సింగరేణి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో అడుగుదూరంలో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి నెలాఖరు నాటికి 631,41,100 టన్నుల టార్గెట్‌కు గాను 627,22,556 టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. టార్గెట్‌ను 99 శాతం చేరుకొని లక్ష్యానికి అతిచేరువలో ఉంది. ఫిబ్రవరిలో 64,23,100 టన్నులకు గాను 64,22,071 టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో అధిక వర్షపాతం, శాసనసభ ఎన్నికలు, సింగరేణి గుర్తింపు ఎన్నికలు, సమ్మక్క సారలమ్మ జాతర జరిగినా కూడా సంస్థ సీఎండీ బలరాం దిశానిర్దేశంతో డైరెక్టర్లు, అధికారులు, జీఎంలు బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు సమష్టిగా కృషి చేశారు. మిగిలిన 30 రోజుల్లో లక్ష్యాన్ని అధిగమించి బొగ్గు ఉత్పత్తి చేసేందుకు ముందుకు సాగుతున్నారు.

సంక్షిప్తం

నిండు జీవితానికి రెండు చుక్కలు

భద్రాచలం, మార్చి 1: పిల్లల నిండు జీవితానికి రెండు చుక్కలు వేయించడం తప్పనిసరని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. పల్స్ పోలియోపై ఆయన శుక్రవారం తన చాంబర్‌లో అధికారులతో సమావేశమయ్యారు. ఈ నెల 3 నుంచి పల్స్ పోలియోను జయప్రదం చేయాలన్నారు.

దమ్మపేట తహసీల్దార్‌గా నరేశ్

దమ్మపేట, మార్చి 1: దమ్మపేట తహసీల్దార్‌గా సీహెచ్ నరేశ్ శుక్రవారం విధుల్లో చేరారు. కరకగూడెంలో పనిచేస్తున్న నరేశ్‌ను దమ్మపేటకు బదిలీ చేస్తూ కలెక్టర్ ప్రియాంక ఉత్తర్వులు జారీ చేశారు. దమ్మపేటలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న నాగప్రసాద్ ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యారు.

డిప్యూటీ సీఎంను కలిసిన అదనపు కమాండెంట్

లక్ష్మీదేవిపల్లి, మార్చి 1: చాతకొండ 6వ బెటాలియన్ అదనపు కమాండెంట్ అంజయ్య, ఆర్ఐ జీవీ రామారావు, ఉదయ్‌కుమార్, ఆర్ఎస్సై భార్గవ్‌లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాద పూర్వకంగా కలిశారు. ఖమ్మం ముదిగొండ మండలంలో శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పర్యటనలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి రావాల్సిన పెండింగ్ బిల్లుల సమస్యను వివరించారు.

తాగునీటి సమస్య పరిష్కారం

'నమస్తే' కథనానికి స్పందన

అశ్వాపురం, మార్చి 1 : 'ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి తిప్పలు' అనే 'నమస్తే' కథనానికి మండల అధికారులు శుక్రవారం స్పందించారు. రాంనగర్ యూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో మొరాయించిన చేతిపంపునకు శుక్రవారం మరమ్మతులు చేపట్టి వాడకంలోకి తెచ్చారు. పాఠశాల ఆవరణలో ఉన్న మిషన్ భగీరథ పైపులైను కూడా మరమ్మతులు చేసి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నట్లు తెలిపారు.

హుండీ ఆదాయం రూ.61 వేలు

అశ్వారావుపేట రూరల్, మార్చి 1: మండలంలోని వినాయకపురం గ్రామంలోని చిలకలగండి ముత్యాలమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని శుక్రవారం అధికారులు లెక్కించారు. జనవరి 17 నుంచి ఫిబ్రవరి 29వ తేదీ వరకు రూ61,616లు ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ అధ్యక్షురాలు బిర్రం రమాదేవి తెలిపారు. కార్యక్రమంలో కొత్తగూడెం డివిజనల్ అధికారి బెల్ సింగ్, ఆలయ ఈవో సూర్యప్రకాశరావు, శ్రీను పాల్గొన్నారు.

రేపు పల్స్ పోలియో

అశ్వారావుపేట, మార్చి 1: పోలియో నిర్మూలన లక్ష్యంతో ఆదివారం నుంచి ప్రభుత్వం చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పల్స్ పోలియో నమోదుపై టాస్క్‌ఫోర్స్ బృందంతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న 6,090 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేస్తామన్నారు. తహసీల్దార్ పీ కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో జీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

దుమ్ముగూడెం, మార్చి 1: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మావోయిస్టు పార్టీ ప్రభావిత ప్రాంతమైన కిష్టారం జిల్లా వెల్కన్‌గూడెం క్యాంపులో అక్కడి యువతకు వాలీబాల్ పోటీలను 217వ బెటాలియన్ శుక్రవారం నిర్వహించింది. క్రీడాసామగ్రిని, విజేతలకు బహుమతులను కమాండెంట్ సతీష్‌కుమార్ దూబే అందించారు. అసిస్టెంట్ కమాండెంట్స్ అజిత్‌కుమార్ చౌదరి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గిరిజన బిడ్డకు బంగారు పతకం

వరలక్ష్మి బంగారు పతకం అలంకరిస్తున్న గవర్నర్

కరకగూడెం, మార్చి 1: వీరాపురం గ్రామానికి చెందిన ఆదివాసీ బిడ్డ వరలక్ష్మి నిరుపేద కుటుంబంలో పుట్టి ఉన్నత చదువులు చదివి గిరిజన జాతికే వన్నెతెచ్చారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా ఎంఫిల్ పూర్తి చేసి గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు. తన భర్త నరసింహారావు ప్రోత్సాహం మరువలేనిదని ఆమె తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన తహసీల్దార్

మణుగూరుటౌన్, మార్చి 1 : పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కరకగూడెం తహసీల్దార్ నాగప్రసాద్ శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు.

సరికొత్త ఆవిష్కరణలు చేయాలి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, మార్చి 1: కాలానుగుణంగా వస్తున్న మార్పులకు తగినట్లుగా కొత్త కొత్త ఆవిష్కరణలు చేపట్టాలని సింగరేణి జీఎం (ఎడ్యుకేషన్) వెంకటేశ్వరరావు సూచించారు. ఇందుకోసం నానో టెక్నాలజీపై పూర్తి అవగాహన పొందాలని సూచించారు. 'ఫ్యూచర్ స్కోప్ ఇన్ నానోటెక్నాలజీ' అనే అంశంపై స్థానిక సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వాహకురాలు డాక్టర్ పి.సునీత ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సింపోజియంలో ఆయన మాట్లాడారు. అనంతరం 'ఇన్నోవేటివ్ మెటీరియల్స్ అండ్ డివైజెస్ ఇన్‌స్పైర్డ్ బై నేచర్' అనే అంశంపై ప్రొఫెసర్ ఉదయ్‌కుమార్, ప్రొఫెసర్ హరి నాథ్ వివరించారు.

రేషన్ దుకాణాల తనిఖీ

భద్రాచలం, మార్చి 1: పట్టణంలోని రేషన్ దుకాణాలను జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి (డీఎస్‌వో) రుక్మిణీదేవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి నెల ఒకటో తేదీన బియ్యం ఇవ్వాలని డీలర్లను ఆదేశించారు. స్థానిక అంబాసత్రం రోడ్డులోని కల్పవృక్ష నారసింహ స్వామిని దర్శించుకున్నారు.

ట్యాంకర్ సహాయంతో నీటి సరఫరా

అశ్వారావుపేట టౌన్, మార్చి 1: పంచాయతీ బోరులో నీరు బురదగా రావడంతో రెండు రోజులుగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ ఈవో హరికృష్ణ శుక్రవారం పట్టణంలోని చిన్నంశెట్టిబజార్‌లో ట్యాంకర్ సహాయంతో నీటిని సరఫరా చేశారు. పంచాయతీ బోరు మరమ్మతులు చేసి నీటి ఎద్దడి లేకుండా చూడాలని కోరుతున్నారు.

రామయ్య దర్శనానికి నెలలో రెండు లక్షల మంది

భద్రాచలం, మార్చి 1: భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారిని ఫిబ్రవరిలో 2,00,122 మంది భక్తులు దర్శించుకున్నారని దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 4న అత్యధికంగా 11,009 మంది, అత్యల్పంగా 27న 1,627 మంది భక్తులు దర్శించుకున్నట్లు వివరించారు. మార్చి, ఏప్రిల్‌లో విద్యార్థులకు పరీక్షలు ముగుస్తున్నందున భక్తుల సంఖ్య పెరగవచ్చని పేర్కొన్నారు.

పాఠశాలకు విరాళం

పాల్వంచ, మార్చి 1: లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ గోల్డ్ ఆధ్వర్యంలో పాల్వంచలోని గట్టాయిగూడెం ప్రభుత్వ పాఠశాలకు రూ.10 వేల నగదును వితరణగా అందించారు. లయన్స్ క్లబ్ గౌరవ సభ్యుడు చాట్ల శ్రీనివాసరావు సహకారంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విద్యా అవసరనిమిత్తం రూ.10 వేల నగదును హెచ్ఎం రేణుకకు అందించారు. అనంతరం పిల్లలకు స్వీట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

మణుగూరుటౌన్, మార్చి 1 : మణుగూరు మండల పరిధిలోని ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రాఘవరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉడుతానేనినగర్, గనిబోయినగుంపు, పాత మణుగూరు, ముత్యాలమ్మనగర్ పంచాయతీ సీటిప్ ఏరియా, గుట్టమల్లారం పంచాయతీలో ప్రభుత్వ భూములను పరిశీలించారు. కొందరు ఆక్రమించిన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నారన్నారు. ప్రభుత్వ భూములకు తప్పుడు పత్రాలు సృష్టించి విక్రయాలకు పాల్పడితే శిక్ష తప్పదని హెచ్చరించారు.

పర్యావరణంపై అవగాహన ఉండాలి

పాల్వంచ, మార్చి 1: పర్యావరణంపై విద్యార్థుల్లో అవగాహన కలిగించడానికి నేచర్ క్యాంపులు దోహదపడతాయని డీఈవో వెంకటేశ్వరచారి పేర్కొన్నారు. పాల్వంచ మండలంలోని కిన్నెరసానిలో ఏర్పాటు చేసిన నేచర్ క్యాంపును శుక్రవారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులు చుట్టూ ఉన్న పరిసరాలను గమనించాలన్నారు.

మహిళా దినోత్సవానికి ఏర్పాట్లు చేయండి

కొత్తగూడెం సింగరేణి, మార్చి 1: సింగరేణి కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహణ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సింగరేణి జీఎం (పర్సనల్) బసవయ్య సూచించారు. ఈ నెల 8న నిర్వహించనున్న ఉమెన్స్ డే వేడుకల కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లపై జీఎం పర్సనల్ కవితానాయుడు సహా మహిళా ఉద్యోగులు, సింగరేణి సెక్రటరీలు, సంబంధిత అధికారులతో సింగరేణి ప్రధాన కార్యాలయంలోని చాంబర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.

పోలియో చుక్కలు వేయించాలి

మణుగూరుటౌన్, మార్చి1: పోలియో రహిత సమాజాన్ని స్థాపించేందుకు 5 సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని మణుగూరు జడ్పీటీసీ పోశం నర్సింహారావు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మార్చి 3న నిర్వహిస్తున్న పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని, చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వ్యాక్సిన్ వేయించాలన్నారు.

బస్టాండ్‌లో కనీస వసతులు కల్పించండి

ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట, మార్చి 1: ప్రయాణికుల కోసం బస్టాండ్‌లో కనీస వసతులు కల్పించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దమ్మపేట మండలం మందలపల్లి నుంచి అశ్వారావుపేట వరకు బస్సులో ప్రయాణించారు. ప్రయాణికులతో మాట్లాడి మౌలిక సదుపాయాలు, ఆర్టీసీ సేవలు, ఉచిత బస్సు ప్రయాణం, ఇతర సమస్యలపై తెలుసుకున్నారు. బస్టాంగ్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ధ్వంసమైన ప్లాట్ ఫాంను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కంట్రోలర్ రంగారావు, సునీతకు సూచించారు. ఆయన వెంట అశ్వారావుపేట సొసైటీ అధ్యక్షుడు చిన్నం శెట్టి సత్యనారాయణ, ఎంపీటీసీలు వేముల భారతీ, మిండా హరికృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా

కొత్తగూడెం సింగరేణి, మార్చి 1: గతంలో కొవిడ్‌తో మృతిచెందిన ప్రైవేటు సెక్యూరిటీ గార్డు కుటుంబానికి తాజాగా మంజూరైన ఎక్స్‌గ్రేషియా చెక్కును సింగరేణి అధికారులు శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. అధికారుల కథనం ప్రకారం.. జిల్లాకు చెందిన సీతాలం సత్యకృష్ణ సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ఎస్‌అండ్‌పీసీ విభాగంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ 2020 ఆగస్టు 8న కొవిడ్‌తో మరణించాడు. అందుకు సంబంధించిన రూ.15 లక్షల కొవిడ్ ఎక్స్‌గ్రేషియా ఇటీవల మంజూరు కాగా.. ఆ చెక్కును మృతుడి సతీమణి సీతాలం వెంకటసత్యవతి, తల్లి పార్వతి, కుమారుడు సత్యనాగయశ్వంత్, కుమార్తె సత్యసాయిశ్రీలకు సింగరేణి జీఎం సెక్యూరిటీ బీఆర్ దీక్షితులు శుక్రవారం సంస్థ కార్యాలయంలో అందజేశారు. సింగరేణి అధికారులు వేణుమాధవ్, జాకీర్ హుస్సేన్, ఎస్‌వీ రమణ, యూనియన్ ప్రతినిధులు రమణమూర్తి, త్యాగరాజన్, పీతాంబరం, సోమిరెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

పోడు రైతులపై కేసు కొట్టివేత

టేకులపల్లి, మార్చి 1: అటవీశాఖ బేస్‌క్యాంప్‌పై దాడిచేశారనే ఆరోపణలపై మండలానికి చెందిన 44 మంది రైతులతోపాటు నాటి జడ్పీటీసీపై ఆ శాఖ పెట్టిన కేసును ఇల్లెందు కోర్టు కొట్టివేసింది. తెలిసిన వివరాల ప్రకారం.. 2015 ఏప్రిల్ 20న చింతోనిచెలక సమీపంలోని అటవీశాఖ బేస్‌క్యాంపుపై నాటి జడ్పీటీసీ సభ్యుడు లక్కినేని సురేందర్‌రావుతో పాటు 44 మంది పోడు రైతులు దాడి చేశారని నాటి ఎఫ్‌బీవో సున్నం నాగయ్య బోడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై జడ్పీటీసీతో పాటు రైతులపై బోడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు తొమ్మిదేళ్ల నుంచి వాయిదాలు కొనసాగుతూనే ఉన్నాయి. సుదీర్ఘ విచారణ తర్వాత కోర్టు సరైన సాక